

# మనసా! మారాం చేయకే

సాయం సంధ్యా సమయం. ఆకాశం మేఘావృతమై పసుపూ – ఎరుపూ మిళితమైన సింధూరపువెలుగుల్తో ఎంతో ఆహ్లాదంగా వుంది.ఇంతటి మనోహరమైన వాతావరణంలో మనసు మయూరిలా నాట్యమాడాల్సింది పోయి అలవాటైన చికాకులతో అస్థిమితంగా వుంది.

మనసంతా ఒహటే అలజడి. ఆఫీసు పని మీద శ్రీవారు కాంపుకి వెళ్ళటంతో మరీ ఊపిరాడని ఫీలింగ్. ప్రాక్టికల్ క్లాస్ ఉన్న రోజుల్లా ఇదే బాధ. ఈ రోజు టైట్రేషన్‌తో ఇక్కడే ఆరయింది.

దీపూకి రేపు హిందీ ఎసైన్‌మెంట్. దగ్గరుండి రాపించకపోతే అన్నీ తప్పులే రాసేస్తుంది.

బాబుకి ఎలా వుందో ఏమిటో! వారం రోజులుగా తగ్గాయనుకోవటానికి లేకుండా విరోచనాలు పతాయిస్తున్నాయ్. పాపం! అత్తగారికి ఈ వయసులో వాడిపెంపకం ఓ యజ్ఞంలా తయారైంది. పోనీ... ఆయాని పెడదామంటే ...... నేనుండగా ఆయా ఎందుకమ్మా అంటూ అడ్డుపెడతారు. ఏమిటో! ఆమెని బాధ పెట్టకూడదనుకుంటూనే తప్పని పరిస్థితై పోతోంది.

వెధవ ఉద్యోగం! మానేద్దామంటే పన్నెండేళ్ళుగా అలవాటైన ఆ కాలేజీ – ఆ లేబరేటరీ – ఆ హడావుడీ జీవితం. ఒక్కసారిగా ఉద్యోగం మానేసి రోజంతా ఇంట్లో వుండడం కూడా నావల్ల కాదేమో ననే భయం.

రోజంతా బాబు ముద్దూ – ముచ్చట్లతో హాయిగా గడిపితే ఎంత బాగుండు అని అప్పడప్పుడూ మనసు మారాం చేసినా... కేవలం వాడి ఆలనా – పాలనతోనే రోజంతా గడపటమనేది మరీ చేతకానితనంగా అనిపిస్తుంది. ఏమిటో...! నిజంగా నేనేమి కోరుకుంటున్నానో.... నాకేమి కావాలో ... నా మనసేమిటో– నామీద నాకే తెలియని సంశయం.

నేను ఉద్యోగం చెయ్యకపోతే నడవని సంసారం కాదు మాది. ఆయనగారి సంపాదనతో సౌకర్యంగా బ్రతకటానికేమీ లోటుండదు.అయినా ఉరుకులూ–పరుగులూ పెడుతూ ఎందుకొచ్చిన ఉద్యోగంరా బాబూ అని మధన పడుతూనే రోజులు దొర్లిస్తూంటాను. కానీ... మానాలంటే మాత్రం మనసు ఊగిసలాటే!

నా ఆశయాల కనుగుణంగా పిల్లల్ని పెంచలేక పోతున్నాననే విషయమొక్కటే నా మనసుని మరీ – మరీ అశాంతి పాలు చేస్తోంది. ఉద్యోగం చేస్తూన్న స్త్రీలంతా నాలాగే అశాంతి పాలయితే... ఎన్నెన్ని రంగాలలో ఎంతో మంది మహిళలు ఎట్లా ముందడుగు వేస్తున్నారో నా కర్థం కాకుండా వుంది.

ఇల్లాంటి అల్లిబిల్లి ఆలోచనలతోటే ఇల్లు చేరుకున్నాను. గేటు మూస్తూ అలవాటుగా పక్కింటి వైపు చూశాను. ఆమెప్రక్క వరండాలో కూర్చుని పిల్లలకు హోమ్‌వర్క్ చేయిస్తోంది. కొత్త పాఠం చెపుతోంది కాబోలు గొంతు మృదు గంభీరంగా వినిపిస్తోంది. పెద్దగా చదువుకున్న దానిలా కన్పించదు కానీ – పాఠం చెవుతూంటే మాత్రం – మరి చదవకుండానే వచ్చేస్తుందేమో అన్నంత చక్కగా చెప్తుంది.

ఈ మధ్య నా మనసులో చెలరేగుతూన్న అసంతృప్తికి సగం కారణం

18-6-93 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

ఆ మేనేమో అని కూడా అనిపిం చక పోలేదు. వాళ్ళు ఇక్కడికి వచ్చి యేడాది కావస్తోంది. ఎప్పుడు చూసినా పిల్లల్లో పిల్లలాగా నిశ్చింతగా నవ్వుతూ కనిపిస్తుంది. కలవు రోజుల్లో పిల్లలు ఇల్లెగిరిపోయేలా అల్లరి చేస్తున్నా ఆ మొహంలో కోపమూ – చిరాకూ కనిపిం చవు. పై పెచ్చు వాళ్ళతో కలిసిపోయి తనూ అల్లరి చెయ్యటమే నాకు మరీ ఆశ్చర్యంగా అనిపిస్తుంది.

ఇంచుమించు నా వయసే వున్న ఆమె ముగ్గురు పిల్లలతో అంత అహ్లాదంగా ఎలా వుంటుందో అర్థం కాదు. మంచంలో వున్న అత్తగారికి సేవలు చేసేప్పుడు సైతం ఆ మొహంలో ప్రసన్నత తాండవిస్తూంటుంది.

నిజానికి ఆమెకూ నాకూ వున్న తేడా ఒక్కటే. ఆమె ఉద్యోగం చేయడం లేదు. నేను ఉద్యోగం చేస్తున్నాను. అంతే. మిగిలిన విషయాల్లో ఇంచుమించు ఇద్దరి జీవితాలకూ ఎంతో సామీప్యం వుంది.

ఆమెను చూస్తున్న కొద్దీ నాకు నేనే చాలా కోపిష్టిలా కనిపిస్తున్నాను. రోజూ నిద్రలేవగానే ఈ రోజు ఏ పరిస్థితుల్లోనూ ఎవరి మీదా చిరాకు పడకూడదనుకుంటాను. కానీ లేచినదగ్గర్నుండీ ప్రతిపనికీ టైమైపోతోంది – లేటయిపోతోంది అనే హడావుడితో నాకు తెలీకుండానే కోపమూ – చిరాకూ నన్నావరించేస్తాయి.

యేరోజుకారోజు నా చిరాకు తగ్గించుకోవాలనుకుంటాను. కానీ... సాయంత్రమయ్యేసరికే ఉన్న ఓపికంతా హారతి కర్పూరంలా హరించుకుపోయినట్టు ఎక్కడలేని నీరసమూ నన్నావరిస్తుంది.

ఫలితంగా స్కూలు నుండి మొహం వేళ్ళాడేసుకుంటూ వచ్చే దీపూకీ, ఆఫీసు పనుల వత్తిడితో అలసటగా ఇల్లు చేరే శ్రీవారికీ సంధ్యారాగంలా నా చిటపటలను ఆస్వాదించటం అలవాటై పోయింది.

కానీ... రోజు రోజుకీ ఎందుకో... నా ప్రవర్తన నాకే ఎంతో అసంతృప్తిగా అనిపిస్తోంది. నేను ఇల్లాలిగా నా కర్తవ్యాన్ని సరిగ్గా నిర్వర్తించటం లేదనే భావన నా మనసునెంతో కలత పెడుతోంది.

కాలేజీలో నీలా టీచర్ కెమిస్ట్రీ యెంతో బాగా టీచ్ చేస్తారని ప్రశంసలందుకున్న నేను నా దీపూకి చెప్పబోయేప్పటికే ఎంతో అసహనంగా మారిపోతాను.

నా మనసులాగే ఇంట్లోని సామానుకూడా చిందర వందరగా కనిపిస్తూ మనసుని మరీ చికాకు పెట్టేస్తుంది. ఈ చిరాకంతా కలిసి విప్పిన షూస్ సరిగా పెట్టలేదనో, యూనిఫాం వాషింగ్ మెషీన్‌లో వెయ్యలేదనో, బాత్‌రూమ్‌లో ట్యాప్ సరిగా కట్టలేదనో, పుస్తకాలన్నీ గది నిండా పరుచుకుని కూర్చున్నావనో ... ఇలా.. ఏదో ఒక రూపంలో దీపూ మీదకు మళ్ళిపోతుంది.

పాపం! దీపూ చప్పుడు చేయకుండా ఆ పూట నా కోపానికి కారణమైన తన తప్పుని దిద్దుకోవటానికి ప్రయత్నిస్తుంటే నోరు విప్పని ఆ చిన్నారి అవగాహనకు నా మీద నాకే కోపమొస్తుంది. ఏది ఏమైనా నా కోపానికి కారణం – నా చేతకాని తనమేననే న్యూనతా భావం నాలో చెలరేగి నిస్సత్తువతో కూడిన నైరాశ్యం నన్నావరిస్తుంది.

“ఏమండీ నీలాంబరిగారూ! ఏ అరుణరాగంలో లీనమైపోయారు!” అంటూన్న ఆమె చిరుదరహాసపు పలకరింపుతో ఆలోచనల నుండి బయట పడి వాస్తవ జగత్తుకి వచ్చాను.

ప్రతిస్పందనతో నవ్వుతూ, “అవును కమలగారూ ! మీరు చెప్పే పాఠం వింటూంటే రోజంతా పాఠాలుచెప్పే నాకే ఏ దిగంతాల నుండో భూపాలరాగం వింటూన్న అనుభూతి కల్గుతోంది” అన్నాను.

“మీరు మరీనండీ! రోజంతా మీరు కాలేజీలో చెప్పే పాఠాల్లో ఇది ఏపాటిది! మీరూ మీ దీపూకి అంత కంటే బాగానే చెప్తూంటారు కదా! ఇందులో అంత చెప్పుకోవాల్సిన విశేషమేముంది కానీ ... రండి ఓ కప్పు కాఫీ తాగి వెళ్దురుగాని! మీ ఇంటి తాళాలు నా దగ్గరే వున్నాయి” అంటూ చనువుగా నా చేయి అందుకున్న ఆమెను యాంత్రికంగా అనుసరించాను.

“స్కూలు నుండి వచ్చేసరికి దీపూకి వళ్ళు వెచ్చగా వుంటేనూ మా వారు దీపూనీ అత్తయ్యగారినీ తీసుకుని హాస్పిటల్‌కి వెళ్ళారు. బాబు ఇక్కడే నిద్రపోతున్నాడు” అంటూ బిస్కట్స్ ట్రే టీపాయి మీద పెట్టి కాఫీ అందించింది.

ఎందుకో... ఆ క్షణం ఇంత కాలంగా నా మనసులో చెలరేగుతూన్న ఆవేదనను ఓ ఆత్మ బంధువులా ఆమెతో పంచుకోవాలనిపించింది.

“కమలగారూ! మిమ్మల్ని చూస్తుంటే ఈ ఉద్యోగమనే జంఝాటం లేకుండా మీలా మంచి గృహిణిగా వుంటే ఎంత బాగుండు అనిపిస్తోంది. ఏమిటో పెళ్ళికి ముందు సరదాగా మొదలు పెట్టాను. కానీ, పెళ్ళయి బాధ్యతలు పెరిగే కొద్దీ ఈ జోడు గుర్రాల సవారీ నా వల్ల కాదనిపిస్తోంది. అటు కోడలుగానూ, ఇటు భార్యగానూ, చివరికి నా పిల్లలకు తల్లిగా కూడా నా బాధ్యతను నేను, సరిగా నిర్వర్తించలేకపోతున్నాననే భావనతో నాకు పిచ్చెక్కిపోయేలా వుందండీ!” అంటూ నిర్లిప్తంగా ఆమె మొహంలోకి చూశాను.

“భలేవారండీ! పవిత్రమైన గురుతర బాధ్యతని నిర్వర్తిస్తూ ఇలా ఆలోచించటం సబబు కాదు”

“అయినా చదివిన చదువుకి సార్థకత చేకూరుస్తున్నాననే ఆత్మసంతృప్తి మీలా నేనుపొందగలనా! ఆర్థికంగా మీ కాళ్ళపై మీరు నిలబడడంలో మీకున్న ఆత్మబలం నాకుంటుందంటారా చెప్పండి!”

“నేను చేస్తున్నదంతా ‘నా’ అనే పరిధికే పరిమితమైంది. కానీ మీరు తీసుకున్న బాధ్యత మీ పరిధిని దాటి మరీ అనంతమైనది కదా!”

“నా ఇల్లూ – నా పిల్లలూ అంటూ మన అమ్మా – అమ్మమ్మల్లాగా నేను నా బాధ్యతని సవ్యంగా నిర్వర్తిస్తున్నానేమో కానీ, సమాజపరంగా నా బాధ్యతంటూ నేనేమి చేస్తున్నాను!

కానీ మీరు సమాజపరంగా మీ బాధ్యతని నిర్వర్తిస్తూ మీ వ్యక్తిగత బాధ్యతలను నిర్వర్తించగలిగే మరో నల్గురు నిర్భాగ్యులకు జీవనాధారాన్ని చూపించటమనేది ఉత్తమమైన మార్గం కాదంటారా! తాత్కాలికమైన ఒడిదుదుకులతో మీరు పొందుతూన్న అశాంతికి పరిష్కారం ఉద్యోగం మానేయటమేనని ఎందుకనుకుంటున్నారు!

మీరు మీ దీపూకి తృప్తికరంగా పాఠాలుచెప్పలేక పోతున్నాననేదే మీ అశాంతికి కారణమైతే, ఇప్పుడున్న నలుగురితో పాటు మరో వ్యక్తికి కూడా జీవనాధారం కల్పిస్తూ మీ దీపూకి మంచి ట్యూటర్ని పెట్టండి. మన ఊళ్ళో చిరుద్యోగం కోసం వెంపర్లాడే నిరుద్యోగులకు కొదవేమీ లేదుకదా!

“అంతేకానీ ఎంత మందికో జ్ఞాన బోధ చేయాల్సిన మీరు నాలాగా ‘నా’ అనే పరిధికే మీ విజ్ఞానాన్ని పరిమితం చేయాలనుకోవడం ఎంత మాత్రమూ వివేకవంతమైన నిర్ణయం కాదంటాను. నేను పొందుతూన్నది కేవలం నా అనే ఆత్మానందం. కానీ మీరు పొందబోయేది అనంతమైన దివ్యానందం సుమా!” అంటూన్న ఆమె మాటలు నా మస్తిష్కంలోని మరో కోణాన్ని నాకు చూపించాయి.

నా మనసు పొరని విప్పిన ఆమెకు ధన్యవాదాలు చెప్పకుంటూ బాబుని ఎత్తుకుని తాళాల గుత్తితో గుమ్మం దాటాను.

–నట్టి శివపార్వతి

### “టచ్ మీ నాట్...?”



‘చంద్రముఖి’ చిత్రంలో ఓ రేప్ సీన్‌లో శ్రీదేవి విలన్ టీనూ ఆనంద్‌ని ఆమడ దూరాన వుంచిందట...! మరి రేప్ సీన్ ఎలా తియ్యడమా అని దర్శకుడు అనుకుంటుంటే తన పాత్ర ‘అప్సరస’ కాబట్టి టీనూ పాత్రను హిప్నొటైజ్ చేసి అతని చెల్లెలా, తల్లిలా కనిపించేటట్లు తియ్యమందట...! తప్పతుందా దర్శకుడికి...సూపర్ స్టార్ చెప్పినట్లే తీశాడట!

– కృష్ణాజీ

